


ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర

సంపుటి : 6 సంచిక : 1 పుష్పం : 01-04 5-10-2000

**RAMANA BHASKARA**

**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**

PAGES : 16

**VOL: 6** **ISSUE: 1**

EDITOR
**P. S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI (HYMA)**

**SUBSCRIPTION**
YEARLY : RS. 140
Each copy Rs. 10

ADDRESS
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S.RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎ 08814 - 24589, 24689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎ 08814 - 22438

## మీరు సృష్టించుకున్న పుస్తకాన్ని మీరే చదివి తరించండి

నేను దేహము అను చిజ్జడగ్రంధి ( ముడి) వలన ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు భ్రమ కలుగును. దీని వలన అజ్ఞానపు భ్రాంతుల అతుకులబొంత అయిన మనస్సు ఉన్నట్లుగా తోచును. దేహ భ్రాంతి వలన తికమక ఏర్పడి, దానివలన వచ్చిన వాసనలు, తలంపుల పుట్ట మనస్సు. ఇదే మనచే సృజింపబడిన మన సొంత పుస్తకము. పదాలు అనేకములున్నా వాటికి ఆధారం కాగితం మాత్రమే అయినట్లు, ప్రపంచంలో అనేక రకాల మనస్తత్వాలు ఉన్నప్పటికీ, వాటికి ఆధారం తలంపులు లేని మౌనస్థితిలో ఉన్న సద్వస్తువు. మన దృష్టిని తలంపులనుండి, వాసనలనుండి ఉపసంహరించి వాటికి ఆధారము ఏది అని నిశ్చల మనోనేత్రముతో తీక్షణ దృష్టితో పరిశీలించగా, తలంపులు లేని సజీవ సుఖ స్వరూపము మనలో ఉప్పొంగును. అట్టి స్థితిలో స్థిరముగా ఉండుటకు ప్రయత్నించగా, ప్రయత్నించగా అది మనకు సహజమగును. ఇట్టి స్థితి గురుకృపవల్ల, వారి సన్నిధిలో మన ప్రయత్నము లేకుండా కలుగును. ఆ తరువాత అంతయు స్వప్నమువలె అనురక్తి లేకయే తోచును. అప్పుడు సుఖ దుఃఖములు అంటవు. అట్టి స్థితిని పొందుటకే మానవ జన్మ కలిగినది. చిత్తశుద్ధితో ప్రయత్నించి అందరు సుఖ స్వరూపులగుదురు గాక! ఇది భగవాన్ శ్రీ రమణ మహర్షి చేసిన ఆత్మబోధ.

....ఎడిటర్


సద్గురు శ్రీ నాన్నగారి జన్మదిన సంచికలో....

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు**


23-9-2000, జిన్నూరు .............................. 3
14-8-2000, చించినాడ .............................. 6
12-9-2000, బలిఘట్టం.............................. 9
10-9-2000, జిన్నూరు .............................. 11



భగవాన్



అరుణాచలం



సద్గురు

అరుణాచలం! అరుణాచలం! అరుణాచలం. ఇది నిశ్చలమైన జ్యోతి స్వరూపానికి స్థూలరూపము. ఇది భూమికి హృదయమై ఉన్నది. ఇది స్థూలబుద్ధి ఉన్నవారికి కొండగా, రాళ్ళగుట్టగా కనబడినను సూక్ష్మబుద్ధి కలవారికి జ్యోతి స్వరూపముగా వ్యక్తమగును. ఇది మృత్యుంజయుడైన శివుని దేహము. ఇది సిద్ధాంతము కాదు. ఇది యదార్థము. జ్ఞాన సంబంధార్‌నకు, మాణిక్యవాచకర్‌నకు, భగవాన్ శ్రీ రమణ మహర్షికి ఈ కొండ జ్యోతి స్వరూపముగా వ్యక్తమయినది. ఈ కొండ వెలసిఉన్న ఊరు పేరు తిరువణ్ణామలై. ఇది మద్రాసుకు 180 కి.మీ.లు దక్షిణముగా ఉన్నది. ఈ పట్టణము శ్రీ చక్రమువలె నవద్వారములతో వెలసి ఉన్నది. ఇచ్చట శివుడు గిరిరూపములోను, లింగరూపములోను, సిద్ధరూపములోను ఉన్నాడు. కొండపైన ఉత్తర దిక్కున ఒక మర్రిచెట్టు క్రింద పరమేశ్వరుడు దేహధారియై సిద్ధరూపములో ఉన్నాడు. ఇచ్చట వెలసిన లింగం అగ్నిలింగం. అగ్ని జ్ఞానమునకు గుర్తు. జ్ఞానము ద్వారా సిద్ధి పొందుటకు ప్రయత్నించువారు ఈ క్షేత్రమునకు ఆకర్షింపబడుదురు. ఈ క్షేత్రమునకు వచ్చువారు గిరిని దర్శించి, గిరిప్రదక్షిణ చేయుదురు. ఈ క్షేత్రమునకు వచ్చినవారు ఒట్టిచేతులతో తిరిగి వెళ్ళరని నాస్తికులు ఆస్తికులుగను, ఆస్తికులు భక్తులుగను, భక్తులు జ్ఞానులు గను అగుదురని భగవాన్ చెప్పినారు. ఈ కొండలోపల ప్రత్యేకముగా ఒక నాగరికత ఉన్నదని, సిద్ధులు తపస్సు చేసుకొంటున్నారని, నదులు, తటాకములు, ఉద్యానవనములు, రహదారులు కలవని శ్రీరమణమహర్షి చూసి చెప్పినారు. ఈ కొండగాలి తగిలిన వారికి కొండమీద ఉన్న మూలికల ప్రభావము వలన కొన్ని భౌతిక వ్యాధులు ఉపశమించును. గిరి అనుగ్రహము వలన మానసిక ఆరోగ్యము పరిరక్షింపబడును. స్కాంద పురాణములో అరుణాచలగిరి విశిష్టత తెలుపబడి ఉన్నది. స్కందుడు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, సనత్కుమారుడు, జ్ఞానసంబంధార్, శ్రీరమణమహర్షి వీరికి బేధంలేదు. శివుని ఆజ్ఞచే మానవ శరీరము ధరించి మధురై వద్దగల తిరుచ్చుళి అను గ్రామములో భగవాన్ శ్రీరమణమహర్షి 1879వ సం. డిసెంబరు 29వ తేది రాత్రి పునర్వసు నక్షత్ర లగ్నంలో సుందరమయ్యర్, అళగమ్మలకు జన్మించినారు. శ్రీరమణ మహర్షి 11వ ఏట సుందరమయ్యర్ దేహము విడిచినారు. అప్పుడు భగవాన్ మరణం గురించి అంతర్ముఖ దృష్టితో విచారణ మొదలు పెట్టినారు. 1896 జూలై 16వ తేదిన భగవాన్ మీనాక్షి గుడివద్ద చొక్కప్ప నాయకన్ వీధిలో ఉన్న తన పినతండ్రి సుబ్బయ్యర్ ఇంటిలో పై భాగమున ఉన్న గదిలో చదువుకొంటూ ఉండగా

తరువాయి 15వ పేజీలో.....

# సాధన ఏ రూపములో చేసినా ప్రథమ తలంపునుండి విడుదలే ముక్తి

ది. 23-9-2000 న సద్గురు శ్రీ నాన్నగారి 67 వ పుట్టినరోజు సందర్భంగా జిన్నూరు రమణక్షేత్రంలో కమిటీవారి కోరికమేరకు ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక సభలో సద్గురు శ్రీ నాన్నగారు ప్రసంగించారు.

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మాకు మనస్సు ఉంది, చిక్కులు వస్తున్నాయి. మీకు మనస్సు లేదు కాబట్టి మీకు చిక్కులు లేవు అందుచేత మీరు చెప్పే బోధ చెప్పకొని పోతున్నారు అని ఒకరు భగవాన్‌తో అంటున్నారు. దానికి భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే అసలు మనస్సే ఒక పెద్ద చిక్కు, అదే ఒక పెద్ద సమస్య. అది ఉన్నంతసేపు నీకు సమస్యలు వస్తూనే ఉంటాయి. మనస్సులోపలకు వెళ్ళటం మానేసి సిద్ధాంతాలు కల్పిస్తూ ఉంటుంది. ఆ సిద్ధాంతం, ఈ సిద్ధాంతం అని వాటి చుట్టూ తిరుగుతూ ఉంటుంది. అదొక మాయ. నీవు ఏ యోగం అభ్యసించినా యోగం మనో నిగ్రహానికి సహకరిస్తుంది. భక్తిపేరు మీద సమాజంలో మూఢనమ్మకాలు వస్తున్నాయి అని అనుకొంటున్నారు. భక్తివలన మూఢనమ్మకాలు రావు, భయం వలన మూఢనమ్మకాలు వస్తాయి. మూఢనమ్మకాలకు భయమే కారణం. నీ హృదయంలో ఉన్న నిజాన్ని తెలుసుకోవాలంటే ఏ సిద్ధాంతం తోటి, అధికారంతోటి, విద్యతోటి, ధనం తోటి సంబంధం లేదు. నీ లోపల తపన ఉంటే, శ్రద్ధ ఉంటే నీ హృదయంలో ఉన్న సత్యం దగ్గరకు చేరుకొంటావు.

మనం ఎంత సాధన చేస్తున్నా శరీరానికి, ఆత్మకు తేడా మనకు తెలియటం లేదు. అవగాహన ముఖ్యం. ఇది ఆత్మ, ఇది దేహం అని వేరుచేసుకొనేబుద్ధి మనకు ఉండాలి, వివేకం ఉండాలి. మనం దేహాన్ని ఆత్మ అనుకొంటున్నాము. దేహం మరణిస్తుంది, ఆత్మ మరణించదు. మరి దేహం ఆత్మ ఎలా అవుతుంది. ఆ విభజన మనకు లేదు. ఇది ఆత్మ, ఇది దేహం అని విభజించుకొనే శక్తి నీకు ఉంటే, నీ బుద్ధిలో స్పష్టత ఉంటే, నీకు నిష్కామభక్తి ఉంటే సిద్ధాంతాలతోటి బాహ్యమైన వ్యక్తులతోటి, వస్తువులతోటి సంబంధం లేకుండా నీ హృదయంలో ఉన్న నిజం నీకు తెలుస్తుంది. మీ ఉపదేశం వినటానికి బాగానే ఉంది, ఆచరించటానికి కష్టంగా ఉంటుంది, అసలు ఎలా ప్రారంభించాలో తెలియటం లేదు. ఏ నేను అయితే ఇప్పుడు నిజం అనుకొంటున్నామో ఆనేను కనిపించనంత దూరం లోపలకు వెళ్ళమంటున్నారు. దానికి అభ్యాసం, వైరాగ్యం ఉండాలి. మీరు చెప్పే మార్గం సరళమైనది, సూటి అయినది గాని అది ఎంత సరళమైనదో అంత కష్టంగా కనిపిస్తుంది అని అంటున్నారు. సరళమైనది, సూటి అయినది అని నీవే ఒప్పకొంటున్నావుకదామరి నీకు ఎందుకు కష్టంగా ఉంది అంటే అనేక జన్మల నుండి నీవు ఏదైతే కాదో దాని వెంటపడుతున్నావు. అదే నిజం అనుకొంటున్నావు. నీవు దేహంకాకపోయినా, మనస్సుకాకపోయినా వాటి వెంటపడుతున్నావు. చిన్నచిన్న విషయాలు మిస్

అయిపోతున్నావు. నీవు ఆత్మవు. నీవు దానివెంట పడటంలేదు. నీవు ఏదైతే కాదో వాటి వెంటపడుతున్నావు. అక్కడ నుండి మనస్సును లాక్కోవటం కష్టం, కష్టం అని నీకు అనిపిస్తోంది. అది నిజంగా కష్టం కాదు, కష్టం అనుకొనేది కూడా తలంపే. నీవు కాని విషయాల మీదకు మనస్సు ఎంత వేగంగా వెళుతోందో నీవు ఏదైతే అవునో దానివైపుకు నీ మనస్సు అంత వేగంగా వెళితే నీ లోపల ఉన్న సద్వస్తువు నీకు సహజంగానే లభ్యమవుతుంది.

మనకు అన్నీ కావాలి, బ్రహ్మం కావాలి అలా ఉంటే బ్రహ్మం తెలియబడదు. బ్రహ్మం ఒక్కటే కావాలి అని మనం అనుకొంటూ ఉంటే, మన గురి అంతా బ్రహ్మంమీదే ఉంటే అప్పుడు బ్రహ్మం అనుకొంటుంది వీరికి ఏ గొడవ లేదు, నిరంతరము నాగొడవలోనే ఉన్నారు, మనం తప్పించి వీరికి ఇంకో ఆలోచన లేదు, బ్రహ్మంను తప్పించి ఏమీ కోరుకోవటం లేదు వీరికి తెలియబడకపోతే ఎలాగ అనుకొని బ్రహ్మం వారికి తెలియబడుతుంది. మనం లోకంలో బంధింపబడటానికి కారణం రూపబుద్ధి, నామబుద్ధి. నీవు ఏదిగా ఉన్నావో దానివైపుకు నీ బుద్ధిని తిప్పాలి. అలా తిప్పటం నీకు ఎందుకు కష్టంగా ఉంది అంటే ఆ అలవాటు నీకు లేదు అందుకు కష్టంగా ఉంది.

కొంతమందికి చదువు ఉంటుంది, సంస్కారం ఉండదు. ఆధ్యాత్మిక అభివృద్ధికి చదువులేకపోయినా సంస్కారం ఉండాలి. నీవు లోపలకు వెళ్ళటానికి ప్రయత్నం చేసేటప్పుడు కొంతదూరం వెళ్ళిన తరువాత మహిమలు రావచ్చును. నీ దేహం ఎంత నిజమో ఆ మహిమలు కూడా అంతే నిజం. కర్మయోగి ఈ రోజును అంటే వర్తమాన కాలాన్ని నమ్ముతాడు. రేపటిరోజును నమ్మడు. రేపు వస్తుందో రాదో ఒకవేళ వచ్చినా ఈ దేహం ఉంటుందో, ఉండదో అనుకొంటాడు. ఈ రోజుచేసే పని ఈ రోజే చేసుకొంటాడు. బద్ధకస్తులు ప్రతీవిషయానికి రేపు అంటారు. సాధనచేసేటప్పుడు నీకు ఎవరూ జ్ఞాపకం రాకూడదు అలా ఉండాలంటే వారి దేహాలను చూడకూడదు, వారిలో ఉన్న గుణాలను చూడకూడదు. అందరి హృదయాలలో ఉన్న ఈశ్వరుడిని చూడాలి. అప్పుడు మీకు వికారం రాదు, ఏకత్వం చూసే బుద్ధి మీకు కలుగుతుంది. అందరి హృదయాలలో ఈశ్వరుడిని చూడగలిగితే మీ మనస్సు బాహ్యాముఖానికి రాదు.

భగవంతుడు కాకుండా దేహబుద్ధితో మీకు ఏ జీవుడు అయితే తరచుగా జ్ఞాపకం వస్తున్నాడో అక్కడ బంధం ఉందని, మమకారం ఉందని గుర్తు. అది పాపాన్ని తీసుకొని వస్తుంది, దానివలన మన స్వరూపానికి దూరమవుతాము. పూర్వజన్మలో మనం ఏ మార్గంలో ప్రయాణం చేస్తే ఆ మార్గం ఇప్పుడు మనకు తేలికగా ఉంటుంది. మీరు ఏ మార్గంలో ప్రయాణం చేసినా నేను సిద్ధమవుతుంది. ఏనేను అయితే మీకు రోజూ సిద్ధమవుతోందో ఆనేనులో నుండి విడుదల పొందటమే యోగం యొక్క లక్ష్యం, అది మనం మిస్ అవ్వకూడదు. మీరు ఏ మార్గంలో ప్రయాణించినా, మీమతం ఏదైనా, మీ

గురువు ఎవరైనా ఈ నేను అనే ప్రథమ తలంపులోనుండి విడుదల పొందాలి. సాధన చేసేవారు అంతా మేము బాగా సాధన చేస్తున్నాము అంటారు. బాగా సాధన చేస్తున్నాము అని చెప్పేది ఆనేనే. ఇంకదానిలో నుండి ఎలా విడుదల పొందుతారు. ఎవడైనా నిన్ను విమర్శిస్తున్నాడు అనుకో వాడు నన్ను విమర్శిస్తున్నాడు అని అనుకొంటే విమర్శ అనే జైలులో పడి ఉంటావు. ఆ విమర్శ ప్రభావం నీ మీదు లేదు అనుకో, ప్రతీకార వాంఛ నీకు లేదు అనుకో వెంటనే ఆ జైలు నుండి బయటకు వచ్చేస్తావు. రాగం ఉన్నా, ద్వేషం ఉన్నా మనస్సు బాహ్యాముఖానికి వచ్చేస్తుంది. అందుచేత రాగద్వేషముల వేగం తగ్గించుకోవాలి. గురువు పట్ల అద్వైతం పనికిరాదు. అద్వైతం అనేది భావనలో ఉండాలి, అనుభవంలో ఉండాలి. గురువుపట్ల గౌరవం ఉండవలసిందే, కృతజ్ఞత ఉండవలసిందే, మూలతలంపు నుండి తప్పించుకోవటానికి ప్రయత్నం చేయవద్దు. దానిని పేస్ చెయ్యి. దానిని పేస్ చేస్తే అది ఎక్కడ అయితే ఉదయించిందో అక్కడకు ఉపసంహరింపబడి అది అదృశ్యమవుతుంది. మూలతలంపు మూలంలోనికి వెళ్ళటానికి ప్రయత్నం చేస్తాము. మధ్యలో ఏదోగుర్తుకు వచ్చి తిరిగి వచ్చేస్తూ ఉంటాము. ఆ జ్ఞాపకం ఎందుకు వస్తోంది అంటే కర్మ పూర్తిగా క్షయం అవ్వలేదు కాబట్టి ఆ జ్ఞాపకం వస్తోంది. నీవు దేహం కాదు అని మీరు చెపుతున్నారు కదా మరి నేను దేహం కాదు అని అనుకోవాలి కదా కాని నేను దేహాన్ని అని ఎందుకు అనుకొంటున్నాను అని అడుగుతున్నారు. నేను దేహాన్ని కాదు అనుకొంటే కర్మ ఎవడు అనుభవిస్తాడు. కర్మ ఖర్చు అయ్యేవరకు కాని దానిని ఔనని అనుకొంటావు. కర్మపూర్తిగా ఖర్చు అయిపోతే దానితో తాదాప్యం పోతుంది. శరీరం అగ్నికి ఆహుతి అవ్వకముందే మూలతలంపు యొక్క మూలాన్ని నీవు తెలుసుకోగలిగితే ఆ మూలంలో బ్రహ్మం ఉంది, ఆ బ్రహ్మానుభవం నీకు కలిగితే బ్రహ్మంకు శరీరం అక్కరలేదు కాబట్టి నీకు పునర్జన్మ రాదు. బ్రహ్మానుభవం కలిగిన తరువాత కూడా నీవు ఉంటావు కాని దేహంతో నీకు పని లేదు, బ్రహ్మానుభవం కలిగినవాడి ఉపాధి ద్వారా పని జరుగుతుంది కాని నేను చేస్తున్నాను అని వాడు అనుకోడు.

నీకు చిక్కులు ఉన్నాయి అంటున్నావు. నీవు ఆత్మవు. ఆత్మకు చిక్కులు లేవు. మరి చిక్కులు ఎవరికి ఉన్నాయో తెలుసుకో. వాడుపోతే నీవు జ్ఞానివి అవుతావు. ఇప్పుడు మనం దేహంగా ఉంటున్నాము, రాగ ద్వేషములుగా ఉంటున్నాము, కోపంగా ఉంటున్నాము, ఇలా రకరకాలుగా ఉంటున్నాము. నీవు ఏ సద్వస్తువుగా ఉన్నావో అలా ఉండటమే జ్ఞానం. అలా అనుకోవటం జ్ఞానం కాదు. అనుకోవటం వస్తే మనస్సు వచ్చేస్తుంది. మనస్సుకు పరిమితులు ఉన్నాయి, చైతన్యానికి పరిమితులు లేవు. పరిమితుల వలననే చిక్కులు వస్తున్నాయి. ఇప్పుడు దేహం నేను అనే భావన నీకు ఎలా ఉందో అలాగ చైతన్యం నేను అనే భావన నీకు స్థిరపడితే ఇంక పరిమితులు లేవు, చావులు లేవు, పుట్టుకలు లేవు. ఏ మానవుడు అయినా వాడి ఒక్కడి కోసమే జీవిస్తూ ఉంటే, వాడి స్వార్థంకోసమే జీవిస్తూ ఉంటే వాడు చనిపోయిన వాడితో సమానము. త్యాగం వలన బలం వస్తుంది. నేను

మంచి చేసినా చెడ్డ ఎదురు వస్తోంది అంటే నీవు కంగారు పడకు, దానిని ఇష్టంగా స్వీకరిస్తే ఈశ్వరానుగ్రహానికి పాత్రుడవుతావు. దేవుడు ఉన్నాడా లేడా అని సందేహాలు పెట్టుకోవద్దు. దేవుడు ఉన్నాడు. ఎక్కడ ఉన్నాడు అంటే నీ హృదయంలో ఉన్నాడు, నీ వెనకాలే ఉన్నాడు. నీ వెనకాల అంటే దేహం వెనకాల కాదు దేహబుద్ధి వెనకాల ఉన్నాడు. నీకు వెనక్కి చూసే అలవాటు లేదు, నీకు లోచూపు అలవాటు లేదు. అందువలన దేవుడు లేడు అనుకొంటున్నావు. లోచూపు అలవాటు లేదని కంగారు పడకు ఇప్పుడు అలవాటు చేసుకో. నీ మనస్సుతో ఆయనను గ్రహించలేవు. మనస్సు ఎక్కడ అణిగిందో అక్కడ ఆయన తెలియబడతాడు. మనస్సును అణచటానికి మనం ఇష్ట పడము ఎందుచేతనంటే అదే మనం అనుకొంటున్నాము.

## రూపదృష్టి ఉన్నవారికి ఆకర్షణలు పెరిగి లోకవాసన పెరుగును

ది. 14-8-2000 న చించినాడలోని గీతామందిరంలో రమణ భక్తులు ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో సద్గురు శ్రీ నాన్నగారు ప్రసంగించినారు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మానవులు రకరకాలుగా ఉంటారు. కొంతమందికి స్థూలబుద్ధి ఉంటుంది, కొంతమందికి సూక్ష్మబుద్ధి ఉంటుంది. స్థూలబుద్ధి ఉన్నవారికి, వారి రూపం, వారి నామం అంటే బాగా ఇష్టం. సూక్ష్మబుద్ధి ఉన్నవారు నామరూపములను విడిచి పెడతారు. నీ శరీరాన్ని జీవుడు విడిచి పెట్టకముందే నామరూపములను, పుణ్యపాపములను, మంచిచెడ్డలను ఎవడైతే విడిచిపెట్టేస్తున్నాడో వాడే మోక్షానికి అర్హుడు. రూపబుద్ధి, నామబుద్ధి ఉంటే మనస్సు అంతర్ముఖం అవ్వదు, ఎంతసేపు బాహ్యముఖానికి వచ్చేస్తుంది. మనం దేవుడికి దాసులం కాదు, మన మనస్సుకు, శరీరానికి దాసులం. నీకు ఎంతధనం ఉన్నా, పాండిత్యం ఉన్నా మనస్సులో నుండి విడుదల పొందకపోతే నీకు జ్ఞానం కలుగదు. నీవు మనస్సుతో ఏదైనా సాధించినా దానివలన ప్రయోజనం లేదు, ఊరేగింపులు మిగులుతాయి. దేవతలు నిజంగా ఉన్నారా అని ఒకరు భగవాన్‌ను అడిగారు. నువ్వు ఉన్నావా అన్నారు భగవాన్. నేను ఉన్నాను అని చెప్పాడు. నువ్వు ఎలా ఉన్నావో వారు కూడా అలాగే ఉన్నారు అని చెప్పారు. ఇవి అన్నీ వ్యవహారిక సత్యములు మాత్రమే, పారమార్థిక సత్యం కాదు. అందరి హృదయాలలో నేను ఉన్నాను అని భగవంతుడు చెపుతున్నాడు అది సూక్ష్మబుద్ధి ఉన్నవారికి సరిపోతుంది. స్థూలబుద్ధి ఉన్నవారికి అది అందదు. అందువలన తరువాత అది నేను, ఇది నేను అని గంభీరమైన వస్తువులను, దేవతాపురుషులనామాలను చెప్పాడు. ఇవి అన్నీ ఎందుకు చెప్పాడు అంటే ఉపాసనకోసం చెప్పాడు. కాని హృదయంలో ఉన్న సత్యవస్తువు పారమార్థిక సత్యం. అది అందరికి అర్థంకాదు కాబట్టి ఉదాహరణగా ఇవి అన్నీ చెప్పాడు. సూక్ష్మబుద్ధి లేకపోతే భగవంతుడు

చెప్పిన వాక్యాన్ని మనం సరిగా అర్థం చేసుకోలేము.

నీవు శరీరంగా ఉన్నప్పడు నీవు ఆత్మవే, జీవుడిగా ఉన్నప్పడు నీవు ఆత్మవే, నామ రూపములను పట్టుకొని తిరుగుతున్నప్పడు నీవు ఆత్మవే. కాని దుష్టనేను ఆత్మగా ఉండనివ్వదు. బయట ఉన్నగౌరవాలతో, అగౌరవాలతో తాదాప్యం చెందేది దుష్టనేను. నిజమైన నేనుకు దేనితోను తాదాప్యం ఉండదు. గౌరవం వస్తే పొంగిపోయేది, అగౌరవం వస్తే కృంగిపోయేది దుష్టనేను. దానిని తీసి ఒక ప్రక్కన పెట్టకపోతే కోటిజన్మలు ఎత్తినా నీకు మోక్షానుభవం కలుగదు. నీవు ఆత్మవే అయినా శరీరంతో తాదాప్యం పొందటం వలన అదే నీవు అని నీకు తెలియటం లేదు. దుష్టనేను ఏమి చేస్తుంది అంటే నీవు ఏదైతే అవునో అదికానట్లు, ఏదైతే కాదో అది నీవు అయినట్లు చూపిస్తుంది. ఈ దుష్టనేనును అలాగే ఉంచుకొని మిగతావిషయాలు ఆలోచిస్తున్నావు. దుష్టనేనును తీసి ఒక ప్రక్కన పెడితేగాని లోపల ఉన్న సద్వస్తువు నీకు అనుభవంలోనికి రాదు. నీ శరీరం కంటే, మాంసం కంటే, రక్తం కంటే నీ లోపల ఉన్న సద్వస్తువు నీకు అత్యంత సమీపంగా ఉంది. కాని దానికి ఎంతో దూరంలో ఉన్నాను అని నీవు అనుకొంటున్నావు. అలా అనిపింపచేసేది దుష్టనేను. రూపబుద్ధి, నామబుద్ధి తగ్గించుకొంటే దుష్టనేనుకు ఫుడ్ సప్లై తగ్గిపోతుంది. నీవు సాధించవలసింది అంటూ ఏదీలేదు, పోగొట్టుకోవలసిందే ఉంది. గతజన్మల నుండి పోగు చేసుకొన్న దుమ్మునంతా మనం తొలగించుకోవాలి, తప్పడు తాదాప్యం తొలగించుకోవాలి. ఒక్కగాఢనిద్రలో మాత్రం దుష్టనేనులోనుండి, అది కల్పించిన విషయములనుండి విడుదల పొందుతున్నాము. జాగ్రదవస్థలో దుష్టనేనునుండి విడుదల పొందటానికి ప్రయత్నం చేయాలి. దానినుండి విడుదల పొందితే పునర్జన్మ ఉండదు. స్వప్నంలో నీవు ఎంతో వైభవం అనుభవించినట్లు వస్తుంది. జాగ్రదవస్థలోనికి వచ్చాక ఆ వైభవం నిజం కాదు అని నీకు తెలుస్తుంది. అలాగే నీకు చైతన్యానుభవం కలిగాక జాగ్రదవస్థలో ఉన్నవైభవాలు కూడా అటువంటివే. అవి నిజంకాదు అని నీకు తెలుస్తుంది. ఇప్పడు నీవు శిరస్సులో ఎలా ఉంటున్నావో అలాగ నీ హృదయగుహలో ఉండగలగాలి. అప్పడు వస్తువు నీకు తెలుస్తుంది. నీవు ఏ పనులు చేసుకొంటున్నా హృదయగుహలో ఉండగలగాలి. హృదయంలో ఉన్న వాడికి రూపబుద్ధి, నామబుద్ధి తగ్గిపోతుంది. మనం దుష్టనేనును అలంకరించకూడదు, దానిని ఉపసంహరించాలి. అరుణాచలేశ్వరుడి గొప్పతనం ఏమిటి అంటే దేహాన్ని చంపడు, దేహంలో ఉన్న దుష్టనేనును చంపుతాడు, అప్పడు వాడు జ్ఞాని అవుతాడు.

నేను ఆత్మను తెలుసుకోవాలి, ఆత్మ దగ్గరకు వెళ్ళాలి అని అడుగుతున్నాడు. ఇది ఎలా ఉంది అంటే రమణాశ్రమంలోనే ఉండి రమణాశ్రమానికి ఎలా వెళ్ళాలి అని అడగటం ఎలా ఉంటుందో ఇది అలాగే ఉంది. నీవు ఆత్మవు. ఆత్మలోనే ఉండి ఆత్మదగ్గరకు ఎలా వెళ్ళాలి అని అడుగుతున్నావు. నీవు ఆత్మవు అన్న సంగతి నీకు తెలియటం లేదు

ఎందుచేతనంటే తప్పడు తాదాప్యంవలన అది నీకు తెలియటం లేదు. ఆ తాదాప్యంపోతే నీవు ఆత్మవే అన్న సంగతి నీకు తెలుస్తుంది. దేహమే నీవు అనుకొని దానితో తాదాప్యం చెందుతున్నావు. దేహబుద్ధి నశించే వరకు వస్తువు ఎంత దగ్గరగా ఉన్నా దాని తాలూక అనుభవం నీకు రాదు. నీవు ఆత్మవు. కాని దాని గురించి నీవు ఆలోచించటం లేదు. అది విడిచిపెట్టి అన్ని విషయముల గురించి ఆలోచిస్తున్నావు మరి దానిని ఎలా పొందుతావు. ఏదైతే అవునో దానిగురించి స్మరణగాని, ఆరాధనగాని తలంపుగాని ఏమీలేదు దానిని విడిచిపెట్టి మిగిలిన విషయాలు ఆలోచిస్తున్నావు. నీవు దేనిగురించి ఆలోచిస్తున్నావో అదే అవుతావు. నీ మనస్సు ఎప్పడూ ప్రకృతి మీద ఉంటుంది ఇంక వస్తువు గురించి ఏమి తెలుస్తుంది. మనలో పెద్దలోపం ఏమిటి అంటే మనకు ఉండవలసినంత వైరాగ్యం లేదు.

దుష్టనేను పైకి లేస్తూ ఉంటుంది, కిందకు పడుతూ ఉంటుంది. మీకు ఎవరిమీద అయినా కోపం వచ్చినా అది నిజమైన నేనుకు రాదు, దుష్టనేనుకు వస్తుంది. ఆ ఉద్రేకం కొద్ది టైము ఉంటుంది మరలపోతుంది ఎందుచేతనంటే అది నిజం కాదు. ఇవి అన్నీ దుష్టనేనుకు వచ్చేవికారాలు. ఆకారాల మీద ఆకర్షణ ఉన్నవాడికి తప్పనిసరిగా వికారం వస్తుంది. ఆకారబుద్ధి లేనివాడికి, దేహబుద్ధి లేనివాడికి వికారం రాదు. మనం ఇంట్లో ఎవరైనా మరణిస్తే ఏదో పదిరోజులు దుఃఖం ఉంటుంది. కొన్ని రోజులు గడిచేసరికి ఆ దుఃఖం పోతుంది. అది తాత్కాలికమే. మన ఇంట్లో ఎవరైనా మరణిస్తే మనం దుఃఖ పడకుండా శాంతిగా ఉండగలిగితే ఆ శాంతిని భగవంతుడు వారికి అందజేస్తాడు. నీ హృదయంలో శాంతి కుదిరితే నీ శరీరం ఉన్నా, లేకపోయినా పంచభూతములతో నీకు సన్నిహిత సంబంధం ఏర్పడుతుంది. నీవు అవసరం ఉంటే మాట్లాడు, కల్పించుకొని మాట్లాడితే దుష్టనేను పెరుగుతుంది. మీ ఇంటికి ఎవరైనా వస్తారు అనుకోండి, వారిని బాగా గౌరవించారు అనుకోండి. వారు ఎక్కడికి వెళ్ళినా మీరు చేసిన గౌరవం గురించి చెపుతారు. ఆ వార్తలు మీరు వింటే దుష్టనేనుకు పొంగువస్తుంది, దానివలన అహంకారం పెరుగుతుంది. ఇటువంటి విషయాలు వచ్చినప్పడు మీరు జాగ్రత్తగా ఉంటే దుష్టనేను పడిపోతుంది. చైతన్యం అంటే అది నీకంటితో చూడబడే వస్తువుకాదు. దానిచేత అన్నీ చూడబడుతున్నాయి. తల్లి గర్భంలో నుండి వచ్చినది మొదలు మనకు చూడటం అలవాటు అయిపోయి దానిని కూడా కంటితో చూడాలని అనుకొంటున్నావు. అది నీవే అయినప్పడు ఇంక కనిపించటం ఏమిటి? అనవసరమైన మాటమాట్లాడాలని మన మనస్సులో తలంపువస్తే తలంపు స్థానంలోనే దానిని ఆపాలి. మాట బయటకు రాకపోతే ఫరవాలేదు. మాట బయటకువస్తే కొంతకాలానికి అది అలవాటుగా మారిపోతుంది. అలవాట్ల వలన తరువాత పొరపాట్లు వస్తాయి, పొరపాట్లు ప్రమాదానికి దారి తీస్తాయి. అందువలన బహుజాగ్రత్తగా ఉండాలి. అహంభావనను ఆత్మలో లీనం చేయమని చెపుతున్నారు అని ఒకరు భగవాన్‌ను అడిగితే అసలు అహంభావన ఉందో లేదో చూడు

ఉంటే లీనం చేద్దువుగాని అన్నారు భగవాన్.

## సత్యం ఎక్కడ ఉందో నీకు రుచి చూపించి నీ చేత అన్వేషింప చేయించేవాడే గురువు

ది.12-9-2000 న విశాఖ జిల్లా బలిఘట్టంలోని బ్రహ్మానంద ఆశ్రమంలో అమరానంద స్వామి శ్రీ జి. రామచంద్రరాజుగారి ఆహ్వానం మేరకు విచ్చేసి సద్గురు శ్రీ నాన్నగారు ప్రసంగించారు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఒక హెడ్‌మాష్టారు భగవాన్‌ను అడుగుతున్నారు. నేను పాఠాలు చెప్పవలసి వస్తోంది, స్కూలు నిర్వహణ చూడవలసి వస్తోంది. నా మనస్సుకు ఎక్కువ పని చెప్పవలసి వస్తోంది. అందువలన ఉద్యోగానికి రాజీనామా చేసి ఎక్కడికైనా వెళ్ళి ఏకాంతంగా ఉండి సాధన చేసుకోవాలని ఉంది దానికి మీ సలహాకోసం వచ్చాను అని అడిగారు. భగవాన్ ఏమి చెప్పారు అంటే నీవు ఉద్యోగం విడిచి పెట్టవద్దు, ఇల్లు విడిచిపెట్టవద్దు. ఉన్నచోటనే ఉండు, చేస్తున్న పనినే చేస్తుండు. పనిమానివేస్తే జ్ఞానం రాదు, సోమరితనం వస్తుంది. జాగ్రత్తగా పనిచేసుకో, నీ చేతపని చేయించేశక్తి లోపల నుండి వస్తుంది. అదే చైతన్యం. ఉన్నదంతా లోపలే ఉంది, బయట ఏమీ లేదు. బయట విషయాలు అన్నీ నీవు కల్పించుకొన్నవే. ఏదైతే నీ హృదయంలో ఉందో అది ఒక్కటే నిజం. చేతులు ఎప్పుడూ పనిచేస్తూ ఉండాలి. మనస్సులో వైరాగ్యం ఉండాలి. ధనం వలన, విద్యవలన, కీర్తి వలన ఇది రాదు. నిజమైన విద్యవలన వైరాగ్యం వస్తుంది. ఆత్మ విద్యవలన మనం ఎవరో మనకు తెలుస్తుంది. మనస్సుకు చాపల్యం ఉండకూడదు. అందరి హృదయాలలో నేను ఉన్నాను అని భగవంతుడు చెప్పాడు కదా ఆ మాట గుర్తుపెట్టుకొని మనం హృదయంలోనికి వెళ్ళ గలగాలి. మనకు అసలు వైరాగ్యం లేదని కాదు ఉండవలసినంత వైరాగ్యం లేదు. అభ్యాసం, వైరాగ్యం వలన జీవుడికి తూకం పెరుగుతుంది. తూకం ఎప్పుడైతే పెరిగిందో మనస్సు హృదయాభిముఖంగా ప్రయాణం చేస్తుంది. నారాయణుడు మీ హృదయంలోనే ఉన్నాడు. మీ హృదయంలో ఉన్ననారాయణుడి స్పర్శ మీకు తగిలినప్పుడు ఒకచేయి ఇంకోచేయిని ముట్టుకొన్నప్పుడు ఆ స్పర్శ మీకు ఎంత స్పష్టంగా తెలుస్తుందో అలాగే మీ హృదయంలో ఉన్న భగవంతుడియొక్క సందేశం అంత స్పష్టంగా మీకు వినబడుతుంది, భౌతికంగా ఆయన స్పర్శ మీకు తెలుస్తుంది. మీరు ఎప్పుడైనా దేవుడిని చూసారా అని వివేకానందుడు రామకృష్ణుడిని అడిగినప్పుడు నేను చూసాను నువ్వు నన్ను ఎలా చూస్తున్నావో, నేను నిన్ను ఎలా చూస్తున్నానో అంత స్పష్టంగా దేవుడిని చూసాను అని రామకృష్ణుడు చెప్పారు. నాకు మాటలు వద్దు, రాతలు వద్దు, హృదయంలో ఉన్న వస్తువును అనుభవించేటట్లు అనుగ్రహించండి, హృదయంలో ఉన్న వస్తువును అనుభవంలోనికి తీసుకొనిరండి అప్పుడు కదా నిజమైన శాంతి నాకు అందేది అని ఒక డాక్టరుగారు ఈ

రోజు అడిగారు. కర్మచేయటం వలన దాని ఫలితం భోగం వస్తుంది. సమాజం పట్ల, ఈశ్వరుడి పట్ల ప్రేమ కలిగి ఉంటే ఆ ప్రేమ ఫలం ఆత్మ సుఖం. అది స్వతంత్రమైన సుఖం. అది శాశ్వతంగా ఉంటుంది.

ఈశ్వరుడు ఉన్నాడనే సజీవమైన విశ్వాసం మనకు ఉండాలి. ఈశ్వరుడి పట్ల సజీవమైన విశ్వాసం ఉంటే మనలో ఏమైనా లోపాలు ఉన్నప్పటికి అవి సరిఅయిపోతాయి. ఆ విశ్వాసం కలగటానికే సజ్జన సాంగత్యం, హోలీ ప్రదేశాలు దర్శించటం, ఏపని చేసినా సామాజిక స్పృహతో చేయటం వీటివలన మన చైతన్యస్థాయి పెరుగుతుంది. మనం విశాలంగా ఆలోచించలేకపోతున్నాము. మీరు చేసే పని అవగాహనతో చెయ్యండి, ఎరుకతో చెయ్యండి. నేను చేస్తున్నాను అనే భావన లేకుండా చెయ్యండి నేను చేస్తున్నాను అనేది కర్తృత్వం, దానిని అనుభవించటం బోక్తృత్వం. ఈశ్వరుడికి కర్తృత్వం లేదు, బోక్తృత్వం లేదు. నీవు కూడా ఈ రెండింటిని తీసి ఒక ప్రక్కనపెట్టు అప్పడు ఈశ్వరుడు తన స్వరూపాన్ని నీకు ఇస్తాడు. జీవుడు లోపల ఉన్నాడు, దేవుడు కూడా లోపలే ఉన్నాడు ఎంతదూరంలో ఉన్నాడు అంటే మూడు జానల దూరంలో ఉన్నాడు. కోటి జన్మలు ఎత్తినా ఈ మూడు జానల దూరం వెళ్లలేకపోతున్నాము. దేహవాసన, లోకవాసన, శాస్త్రవాసన ఈ మూడింటిని అతిక్రమిస్తే దేవుడు తన స్వరూపాన్ని మనకు ఇస్తాడు.

ప్రతీమానవుడికి సుఖంకావాలి, శాంతి కావాలి. కాని అది ఎక్కడ ఉందో మనకు తెలియటంలేదు. సత్యవస్తువు ఎక్కడ ఉందో, సుఖం ఎక్కడ ఉందో నీకు సూచనలిచ్చి అక్కడనీచేత అన్వేషింపచేయించేవాడే గురువు. నీవు చేస్తున్నపని కర్తృత్వం చేస్తే నీవు టైర్ అవుతావు. చైతన్య స్మృతిలో ఉండి చేస్తే నీవు టైర్ అవ్వవు. నీవు దేహం కాదు అని భగవంతుడు చెపుతున్నాడు అయినా నేను దేహాన్ని అని నీవు అనుకొంటున్నావు ఎందుచేతనంటే నేను దేహాన్ని అని అనుకోకపోతే నీకు కర్మ ఖర్చు అవ్వదు. కర్మానుభవం కోసమే ఈ దేహం వచ్చింది. అనుభవించేది ఇష్టంగా అనుభవిస్తే కొత్తవాసనలు రావు, పాతవాసనలు పోతాయి. నీవు చేస్తున్న సాధనతోపాటు, అభ్యాసంతోపాటు, కర్మకూడా ఖర్చు అవ్వాలి. కర్మఖర్చు అయిపోతే నీకు దేహాభిమానం పోతుంది. మీరు పనిదొంగలు అవ్వవద్దు. జాగ్రత్తగా పనిచేసుకోండి. మీరు చేసేపనిలో భగవంతుడిని చూడండి. అది భగవంతుడిపని అనుకోండి. పనిని చాకిరీ అనుకోవద్దు, పనిని పూజ అనుకోండి. పనిని సక్రమంగా చేస్తే ఆపని నిన్ను విడిచిపెట్టేస్తుంది. సక్రమంగా చేయకపోతే నీవు సక్రమంగా చేసేవరకు నీకు జన్మలు వస్తాయి. పనిని విసుగులేకుండా, చిరాకులేకుండా ప్రేమతోచేస్తే ధ్యానం చేసేవాడు ఏస్థితిని పొందుతాడో ఆస్థితిని నీవుకూడా పొందుతావు. మేము అందరిచేత మంచివారము అనుపించుకోవాలి అనికొంతమంది అనుకొంటూ ఉంటారు. అది పిచ్చితనం. నీవు దేవుని అనుగ్రహానికి పాత్రుడవు అవుతున్నావా, లేదా అది చూసుకో దేవుని అనుగ్రహానికి పాత్రుడవటం ముఖ్యం. నిన్ను నీవు చూసుకొని లోకాన్ని చూడు.

అప్పుడు లోకం అంతా ఆత్మగానే కనబడుతుంది. అప్పుడు లోకంలో ఉన్న జిడ్డునిన్ను అంటదు, లోకం నిన్ను బంధించదు. నిన్ను నీవు చూసుకోకుండా లోకాన్ని చూస్తే లోకంలో ఉన్న జిడ్డు అంతా నిన్ను అంటుకొంటుంది. నీ లోపల ఉన్న సత్యంతో సంబంధం వదిలేసావు. దానితో కలిసి జీవించు, దాని తాలూక ఎరుక కలిగి ఉండు. ఇప్పుడు నీవు దేహంతో ఎలా తాదాప్యం పొందుతున్నావో, మనస్సుతో ఎలా తాదాప్యం పొందుతున్నావో అలాగ లోపల ఉన్న సద్వస్తువుతో తాదాప్యం పొందు.

లోపలకు వెళ్ళు, లోపలకు వెళ్ళు అని చెపుతున్నారు ఎంతదూరం వెళ్ళాలి అని అడుతున్నారు. నీవు నేను, నేను అంటున్నావు కదా. ఆనేను అనే తలంపు లేదని తెలిసేవరకు లోపలకు వెళ్ళు. టెక్నాలజీ అభివృద్ధి అయింది నిజమే దానిని నీవు స్వార్థానికి ఉపయోగించుకొంటున్నావు, దానిని ఉపయోగించుకొని ధనం సంపాదించు కొంటున్నావు. ఇంక నీకు ఆత్మజ్ఞానం ఏమిటి? ప్రారబ్ధమును బట్టి దేహయాత్ర సాగుతూ ఉంటుంది, దేహయాత్రను ఆపుచేయలేవు. మనోనిగ్రహం నాజన్మహక్కు అని అనుకోవద్దు. కష్టపడి సాధన చేస్తే అది వస్తుంది. సబ్జక్టు సరిగా అవగాహన చేసుకోవటం వలన, శరణాగతి వలన నీ మనస్సుకు నిగ్రహం వస్తుంది. భక్తుడికి భగవంతుడిని ఏదో ఒకటి అడగాలని ఉంటుంది, ఏదీ అడగకపోయినా మోక్షం అయినా అడుగుతాడు. కొంతమంది ఏదో పనిచేస్తూ ఉంటారు, వారికి భోగం మీద అపేక్ష ఉంటుంది. దేనిమీద అభిమానం లేనివాడు ఎవడు అంటే తత్వం తెలిసినవాడికి దేనిమీద అభిమానం ఉండదు. నీవు చేసే పని సక్రమంగా చెయ్యి, ప్రేమగా చెయ్యి. నీవు చేతులతో పని చేస్తున్నా మనస్సుకు చాపల్యం లేకుండా చూసుకొని, మనస్సు సాధ్యమైనంత వరకు హృదయాభిముఖంగా వెళ్ళేటట్టు చూసుకో. మనం ఏ పని చేస్తున్నా మనస్సులోపలకు వెళుతోందా, బయటకు వెళుతోందా అనేది చూసుకోవాలి. హెడ్మాష్టారుకు భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే నీవు తొందర పడకుండా నిదానంగా చేస్తే నీ వృత్తి నీకు ఏవిధంగాను అవరోధం కాదు. నీవు ఉద్యోగం విడిచిపెట్టనక్కరలేదు, నేను ఉద్యోగాన్ని విడిచిపెట్టేస్తాను అనే భావనను విడిచిపెట్టు. నీవు ఉద్యోగం చేయటమూ, మానటమూ అనేది కాదు నీ మనస్సు లోపలకు వెళుతోందా, బయటకు వెళుతోందా అది చూసుకో. మనస్సు బయటకు వెళితే లోకం, అశాంతి, అజ్ఞానం. మనస్సు లోపలకు వెళితేశాంతి, సుఖం, జ్ఞానం, చావులేని వస్తువును పొందుతావు.

## బంధానికి కారణం మన స్వరూపమైన చైతన్యమును మర్చిపోవటం

ది.10-9-2000 న జిన్నూరులో రమణ క్షేత్రంలో ఆ గ్రామ సత్సంగ సభ్యుల కోరిక మేరకు ఆధ్యాత్మిక వేదికపై సద్గురు శ్రీ నాన్నగారు ప్రసంగించారు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మూలతలంపు తన సంతోషం కోసం దేహాన్ని, మనస్సును ఉపయోగించుకొంటుంది. మూలతలంపు దేహం లేకుండా ఉండలేదు కాబట్టి దానికి పునర్జన్మ వస్తుంది. మన సంతోషం కోసం దేహం మీద, ఇంద్రియాల మీద, మనస్సు మీద ఎంతకాలం అయితే ఆధారపడి ఉంటామో అంతకాలం పునర్జన్మ వచ్చి తీరుతుంది. ఎవడికైనా ఆత్మజ్ఞానం కలిగితే వాడు మాత్రం సంతోషంకోసం, సుఖంకోసం దేహంమీదగాని, మనస్సు మీదగాని, పరిసరాల మీదగాని, పరిస్థితుల మీదగాని ఆధారపడి ఉండనక్కరలేదు. ఒక్క జ్ఞాని మాత్రమే స్వతంత్రుడు. వైరాగ్యం అనేది ఒక మానసిక స్థితి అది మనకళ్ళతో చూసేది కాదు. కొంతమందికి ఎంతధనం ఉన్నా లోపల వైరాగ్యం ఉంటుంది. మనకు లోపల వైరాగ్యం ఉండాలి. మన ప్రవర్తనలో బాధ్యత ఉండాలి. అప్పుడు ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతాము. ఇతరులకు ఏదైనా మంచి జరిగింది అనుకోండి. అప్పుడు వారు ఎంత సంతోషిస్తున్నారో మనకు కూడా అంత సంతోషం వస్తే అప్పుడు కూడా మనం ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతాము. ధ్యానం చేసేటప్పుడు మీకు ఏదైనా సంతోషం రావచ్చు, అక్కడ ఆగిపోవద్దు. ఈ సంతోషం ఎవరికి వస్తోంది అని విచారణ చేసి వాడిని వాడి మూలంలోనికి పంపండి. మూలతలంపు మూలంలో నీవే ఉన్నావు. మూలతలంపు యొక్క మూలం నీకు ఎందుకు తెలియటం లేదు అంటే నీవు కాని దేహంతో నీవు తాదాత్మ్యం పొందుతున్నావు. నీకు లోపల పుణ్యబలం ఉంటే, నీకు బుద్ధి సూక్ష్మత ఉంటే నీలోపల ఉన్న బ్రహ్మం నీకు తెలియబడుతుంది. పరమపవిత్రుడికిగాని లోపల ఉన్న వస్తువు వ్యక్తం కాదు.

మనమాట, చేత, ఆలోచన నిదానంగా ఉండాలి. బాహ్యకారణముల వలన ఏదైనా సంతోషం వచ్చినా అదే చివరిస్థితి అనుకోవద్దు. అనుకూలపరిస్థితులు వచ్చినప్పుడు పొంగిపోకు, ప్రతికూల పరిస్థితులు వచ్చినప్పుడు కృంగిపోకు. వీటి వలన మూలతలంపు పెరిగిపోతుంది. నీకు ఏదైనా చెడ్డ జరిగింది అనుకో ఈ చెడ్డ ఇలా జరిగింది ఏమిటి అని కంగారుపడకు. ఈ చెడ్డ ఒక మంచికి దారి తీయవచ్చు. మీరు ఈశ్వరుడి పట్ల శరణాగతి పొందే కొలది మీకు తెలియకుండా మీ మనస్సుకు నిగ్రహం వస్తుంది. సాధకుడికి కూడా అనేక ఆకర్షణలు వస్తాయి. ఇది నేను కాదు, ఇది నేను కాదు అని వాటిని గెంటుకుంటూ వెళితేగాని హృదయం యొక్క లోతులలోనికి వెళ్ళలేవు. నీలోపల శాంతి ఉంది, అది స్వతంత్రమైనది. అక్కడికి చేరేవరకు నీ ప్రయాణం ఆపు చేయవద్దు. నిద్రలో నీకు తలంపులు లేవు. తలంపులు లేవు కాబట్టి నిద్రలో సుఖంగా ఉన్నావు. నిద్రావస్థలో తలంపులు లేకుండా ఎలా ఉన్నారో జాగ్రదవస్థలో అలా తలంపులు లేకుండా ఉండగలిగితే అది సమాధిస్థితి. సమాధిస్థితిలో మీరు ఉన్నారని మీకు తెలుస్తూ ఉంటుంది, శాంతిగా ఉంటారు, ఆనందంగా ఉంటారు. అక్కడ తలంపులు రావు వచ్చినా అవి నిన్ను బంధించవు. చైతన్యమే నీ సహజస్థితి, దాని స్వరూపమే సుఖం, దాని స్వరూపమే శాంతి. చైతన్యానికి సంబంధించిన మరుపు వలననే ఈ బంధం కలిగింది, ఆ మరుపు లేకపోతే

నీకు బంధం లేదు. ప్రారబ్దంలో ఉంటే ధనం, కీర్తి, అధికారం అన్నీ వస్తాయి. వాటితో తాదాప్యం పొందితే మూలతలంపు పెరిగిపోతుంది. ప్రారబ్దంలో ఏది వచ్చినా దానితో తాదాప్యం లేకపోతే మూలతలంపు దాని అంతట అదే అణిగిపోతుంది. మూలతలంపు అణిగినచోట మన స్వరూపం మనకు తెలుస్తుంది. నీవు జీవితంలో సహజంగా ఉంటే నీకు నిజం తెలుస్తుంది. నీవు సహజంగా ఉండటానికి ఏవైతే అడ్డువస్తున్నాయో వాటిని తొలగించుకో.

ఆత్మానుభవం పొందటానికి మనకు ఏవైతే ఆటంకాలుగా ఉన్నాయో చూసుకొని వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేయాలి. నీలోపల ఉన్న బ్రహ్మంతో కలిసి ఉండటమే సత్సంగం, లోపల ఉన్న బ్రహ్మముతో కలసి ఉండలేకపోతే బయట ఉన్న సత్పురుషులతో సహవాసం చెయ్యి. దాని వలన సహృదయం, సద్బుద్ధి కలుగుతుంది. ఏది ఆలోచించినా నెగిటివ్‌గా ఆలోచించవద్దు, పోజిటివ్‌గా ఆలోచించు. మనస్సును ఎప్పుడూ ఆత్మయందు, ఇష్టదేవతయందు నిలబెట్టి ఉంచు. అప్పుడు నీలో ఉన్న బలహీనతలు, ఆటంకాలు ఒక్కొక్కటిగా వాటి అంతట అవే రాలిపోతాయి. అనేక జన్మలనుండి దొంగగడ్డికి మనస్సు అలవాటు పడి ఉంది. అంటే సహజమైన శాంతి కాకుండా ఇంద్రియాల ద్వారా వచ్చే శాంతికి, బయటనుండి వచ్చే ఆనందానికి ఇలా ఏదో దొంగ గడ్డికి అలవాటు పడి ఉంది. ఇప్పుడు నీవు మనస్సును సంస్కరించాలనుకొంటే దాని అలవాటు ఎక్కడికి పోతుంది. దాని అలవాటు అంత తొందరగా పోదు. నీ శరీరానికి వయస్సు 50 సంవత్సరాలు ఉండవచ్చుగాని దాని అలవాటు కొన్ని వేలజన్మల నుండి వస్తోంది. ఈ రోజు నీవు ఏదో చిన్నచిన్నసాధనలు చేయటంవలన దాని అలవాటు పోదు. భగవంతుని గురించి ఆత్మ గురించి శ్రవణం చేసి మనస్సును అక్కడ ఉండమని చెపుతున్నాము కాని మనస్సు అక్కడ నిలబడదు. దొంగ పచ్చగడ్డికి అలవాటు పడిన ఆవు మనం ఎదురుగా పచ్చగడ్డి పెట్టినా అలవాటును బట్టి దొంగ పచ్చగడ్డి దగ్గరకు వెళ్ళిపోతుంది. అలా రోజూ వేయగా వేయగా ఈ పచ్చగడ్డి బాగుంది ఇంక దొంగ పచ్చగడ్డి అనవసరం అని ఆవుకి గుణం కుదిరాక ఇంక దొంగ గడ్డికి వెళ్ళదు. అలాగే నీ మనస్సుకి కూడ బాహ్యవిషయాల నుండి వచ్చేశాంతి నిజంకాదు. హృదయంలో ఉన్న శాంతి నిజమైనది అని అర్థం అయినప్పుడు మనస్సు ఇంక బయటకు వెళ్ళమన్నా వెళ్ళదు. దాని అలవాటును బట్టి మనస్సు బయటకు వెళుతూ ఉంటుంది. మీరు కంగారు పడకండి. మీ మనస్సును వెనక్కి లాక్కొని చైతన్యం మీద, ఇష్టదైవంమీద, మీ గురువు మీద నిలబెట్టుకోండి. లోపల ఉన్న వస్తువు కర్మఫలం వలన పొందేదికాదు, అది జ్ఞానఫలం, అది ప్రేమ ఫలం. కొంతమంది మనుషులకు సహజంగానే మానవ జాతిమీద ప్రేమ ఉంటుంది. ఆ ప్రేమ వలన వచ్చేఫలం ఆత్మజ్ఞానం. మీరు స్వచ్ఛంగా, శాంతిగా, వివేకంగా, సహజంగా ఉంటే దాని ఫలం ఆత్మజ్ఞానం.

**రమణభాస్కర**

నాకు జబ్బుగా ఉంది అంటావు. నీకు జబ్బులేదు, నీ శరీరానికి జబ్బు ఉంది. శరీరం నీవు అనుకొంటున్నావు కాబట్టి నాకు జబ్బుగా ఉంది అంటున్నావు. నాకు బెంగగా ఉంది, నాకు దుఃఖం వస్తోంది అంటావు. వాటిని నీవు నొక్కిపెట్టి అణిచి ఉంచనక్కరలేదు. నీవు అసహజంగా ఉండటం వలన నీకు బెంగ వస్తోంది. సహజంగా ఉంటే బెంగరాదు. నీకు దుఃఖం వస్తూ ఉంటే అది ఎందుకు వస్తోంది అని విచారణ చేస్తే అది పోతుంది. నీవు నీ సహజస్థితిలో ఉండలేక ఏదో ఒకదానితో తాదాప్యం చెందటం వలన ఈ తిప్పలు అన్నీ వస్తున్నాయి. పూజలు, జపాలు చేసి పారిపోవటానికి ప్రయత్నించవద్దు. తాత్కాలిక గొడవలు వద్దు. నీ హృదయంలో ఉన్న వస్తువు నీకు అందకుండా ఏదైతే అడ్డువస్తోందో దానిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేయండి. లోకంలో ధర్మం స్థాపించటానికి చాలామంది కృషిచేస్తున్నారు కదా. మీరు మాత్రం ఇక్కడే ఆశ్రమంలో కూర్చొని ఉంటున్నారు అని ఒకరు భగవాన్‌ను అడిగారు. ధర్మం యొక్క చింతన మీకు నిద్రలో ఉందా అని భగవాన్ అడిగారు. ధర్మం గొడవ నిద్రలో లేదు అని చెప్పాడు. మరి ఎప్పుడు వస్తోంది మెలుకువ వచ్చాక మనస్సు వచ్చాక వస్తోంది. నీవు చెప్పే ధర్మం నీ మనస్సు ఎంత నిజమో అది కూడా అంతే నిజం. అది వ్యవహారిక సత్యమేగాని పారమార్థిక సత్యంకాదు. ధర్మం అనేది, అధర్మం అనేది లోకవ్యవహారం. నీ దేహం ఎంతనిజమో, నీ మనస్సు ఎంతనిజమో అవికూడా అంతే నిజం గాని అవి స్వరూప సత్యంకాదు. చైతన్యమే నీ గమ్యం. ధర్మం ఆచరించటం నీ గమ్యం కాదు. నేను మంచి పనులు చేస్తున్నాను అని రామకృష్ణుడితో అంటే అదే పనా నీకు అన్నారు. మంచి పనులు చేయటం మంచిదే అదే నీ గమ్యం కాదు. దాని ద్వారా పొందవలసింది వేరే ఉంది. దానిని పొందటానికి నీ మంచి పని సహకరిస్తుంది కాబట్టి మంచిపని చెయ్యి. ఇది సాధనే గాని సిద్ధికాదు. నిన్ను నీవు చూసుకోకుండా లోకాన్ని చూస్తే ప్రతీజన్మలోను అంతా గందరగోళమే. గందరగోళం వస్తే కంగారు పడకు. ఈ గందరగోళం అంతా ఎవరికి వస్తోంది అని ప్రశ్నించుకో. నేనుకు వస్తోంది. ఆ నేను కూడా ఒక తలంపే. ఆ నేను ఎవరు అని ప్రశ్నించు. అది దాని మూలంలోనికి వెళ్ళిపోతే గందరగోళం లేదు. గందరగోళం మధ్యలో కూడా శాంతిగా ఉంటావు. లోకానికి ధర్మం ఉంది, అధర్మం ఉంది, మంచి ఉంది, చెడ్డ ఉంది. నీవు ఊహించేవి ఏమీ ఆత్మలో లేవు. మనస్సు ఇప్పుడు విషయాలను చింతిస్తోంది. విషయాలను చింతించటం మానివేస్తే మనస్సు వెనక్కి వెళ్ళి ఆత్మను చింతిస్తుంది. చిత్తం విషయాలను చింతించటం మానివేసి ఆత్మను చింతిస్తూ ఉంటే చిత్తం యొక్క మూలం తెలుస్తుంది. చిత్తం యొక్క మూలం తెలిసిన వాడికి తత్వం తెలుస్తుంది. తత్వం తెలియటం అంటే నీవు ఎవడో నీకు తెలుస్తుంది. నీవు ఎవడో నీకు తెలిస్తే జననమరణ ప్రవాహము నుండి బయటకు వచ్చేస్తావు, ప్రకృతిని దాటి వెళ్ళిపోతావు.

అకారణముగా ఆయనను మరణభయము చుట్టిముట్టినది. అప్పుడు ఆభయమును శ్రీరమణమహర్షి నిశ్చలమనుస్సుతో పరిశీలించెను. ఇప్పుడు ఈ దేహము చనిపోయినది. ఇది స్మశానమునకు తీసుకొని వెళ్ళబడును అని తలంచినారు. ఆ సమయములో ఆయన శరీరము నిజముగా చనిపోయినది. ఈ శరీరము చనిపోయినప్పటికి చైతన్యవాహినిగా నేను ఉన్నాను. అని అనుభవ పూర్వకముగా అప్పుడు ఆయన తెలుసుకొనిరి. ఆ తరువాత తిరిగి చైతన్యం శరీరంలో ప్రవేశించి శరీరము కదలుట ప్రారంభించినది. అప్పటి నుండి భగవాన్ చైతన్యముతో తాదాప్యము పొంది సహజసమాధిస్థితిలో స్థిరపడినారు. శివుని ఆజ్ఞమేరకు ఆయన 1896 వ సం. సెప్టెంబర్ 1వ తేదీన తిరువణ్ణామలై వచ్చి అచ్చట ఏబది నాలుగు సం॥లు ఆత్మబోధను చేసినారు. భగవాన్‌తో అన్నిరకముల జంతువులు కుక్కలు, నెమళ్ళు, కోతులు, పాములు, ఉడతలు, గోవులు స్నేహముగా ఉండేవి. భగవాన్ సన్నిధిలో గోవులక్ష్మి, తల్లి అళగమ్మ మోక్షమును పొందినారు.

## భగవాన్ తిరువణ్ణామలైలో నివశించిన ప్రదేశములు

| | |
|---|---|
| 1896 వ సం॥ | పెద్దగుడి ( అరుణాచలేశ్వరుని ఆలయము), పాతాళ లింగం, గోపురాలు |
| 1897 వ సం॥ | గురుమూర్తం, మామిడితోట |
| 1898 నుండి 1899 సం॥ | పవలకున్రు, కొండగుహలు, పచ్చెయ్యమ్మన్ కోయిల్ |
| 1900 నుండి 1916 సం॥ | విరూపాక్ష గుహ |
| 1916 నుండి 1922 సం॥ | స్కందాశ్రమం |
| 1922 సం॥ నుండి | శ్రీరమణాశ్రమం |

1950 వ సం॥ ఏప్రియల్ 14వ తేదీ రాత్రి గం॥ 8-47 ని॥లకు భగవాన్ దేహము వీడిచి జ్యోతి స్వరూపము ఉల్కగా పైకి కనబడి అరుణాచలం కొండలో ఐక్యమయినారు.

ఆత్మజ్ఞానము అనుభవంలో ఉన్నవారిని సద్గురువులు అందురు. ఆ కోవలోని వారే సద్గురు శ్రీ జిన్నూరు నాన్నగారు. భగవాన్ శ్రీ రమణమహర్షి యొక్క ఆత్మబోధను సరళమైన భాషలో సద్గురు శ్రీ నాన్నగారు గత 40 సం॥ల నుండి ఎండకు వానకు వెరయక కుగ్రామములు కూడా వెళ్ళి అతి సామాన్యులకు కూడా అందుబాటులో ఉండి వారి భౌతిక అవసరములు కూడా తీర్చి అనుగ్రహభాషణములు అందిస్తున్నారు. ఈ అనుగ్రహభాషణములు చదివి మననం చేసి తరించండి.

**శ్రీ రమణ క్షేత్రం**

జిన్నూరు